క్లుప్తంగా

నిబంధనలు పాటించకుంటే చర్యలు

దర్శి: నిబంధనలు పాటించకపోతే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎంవీఐ రవికుమార్ అన్నారు. పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ సుందరరావుతో కలిసి కురిచేడు రోడ్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించామన్నారు. కంట్రోలర్ రామయ్య పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి మంత్రి నివాళి



లక్ష్మీదేవికి నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పెద్దారవీడు: మండలంలోని ఏనుగులదిన్నెపాడులో స్థానిక జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి తల్లి లక్ష్మీదేవి ఇటీవల మృతి చెందిన విషయం తెల్సిందే. బుధవారం లక్ష్మీదేవి పెద్దకర్మకు హాజరైన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం శాసన సభ్యుడు కేపీ నాగార్జునరెడ్డి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారితో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ మండల నాయకులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

రేపు డయల్ యువర్ డీఎం

మార్కాపురం: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ఈ నెల 10వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు బుధవారం విలేకరులకు తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ప్రయాణికులు, ప్రజలు సమస్యలేమైనా ఉంటే 99592 25699 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

గిద్దలూరు రూరల్: ఈ నెల 10వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ పరంగా ప్రజలకు ఎటువంటి వసతులు కావాలి, ఇతర సౌకర్యాలు వంటి విషయాల గురించి తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

అర్ధవీడు ఎంపీడీఓగా మస్తాన్‌వలి

అర్ధవీడు (కంభం): అర్ధవీడు నూతన ఎంపీడీఓగా సయ్యద్ మస్తాన్ వలి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ జగదీష్ డిప్యుటేషన్‌పై ఒంగోలుకు వెళ్లిన నేపథ్యంలో కంభంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న మస్తాన్‌వలిని అర్ధవీడుకు ఎంపీడీఓగా బాధ్యతలు ఇస్తూ బదిలీ చేసిన నేపథ్యంలో ఆయన బుధవారం విధుల్లో చేరారు. నూతన ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

సాగు పత్రాలతో రైతులకు లబ్ధి

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు తాము సాగు చేసిన పంటకు సంబంధించిన సాగు పత్రాలతో లబ్ధి చేకూరుతుందని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. తాళ్లూరు రైతు భరోసా కేంద్రంలో బుధవారం ప్రభుత్వం మంజూరు చేసిన సాగు పత్రాలను రైతులకు అందజేశారు. జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వరరెడ్డి, ప్రియాంకా నాగార్జునరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు జయరామిరెడ్డి, కోటిరెడ్డి, ఏఓ ప్రసాదరావు, ఎంపీటీసీ ప్రభుదాసు, తహసీల్దార్ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

కొండచిలువ పట్టివేత



కొండచిలువతో స్నేక్ క్యాచర్ నిరంజన్

మార్కాపురం: పట్టణ శివార్లలోని ఇందిరమ్మ కాలనీ వద్ద జనావాసాల మధ్య సంచరిస్తున్న 15 అడుగుల పొడవున్న భారీ కొండచిలువను ప్రజలు గుర్తించి బుధవారం సాయంత్రం స్నేక్ క్యాచర్ నిరంజన్‌కు సమాచారం ఇవ్వడంతో పట్టుకున్నాడు. ఇటీవల కాలంలో ఇంత పెద్ద కొండ చిలువను పట్టుకోలేదని, ఇది కోళ్లు, కుందేళ్లు, మేకపిల్లలను తింటోందని తెలిపారు. పాములు, కొండచిలువలు కనిపిస్తే చంపవద్దని తనకు సమాచారం అందించాలని తెలిపారు.

మెట్ట పైర్లకు జీవం



నాగంపల్లిలో జీవం పోసుకున్న అలసంద పంట



గొట్లగట్టులో బెట్ట నుంచి కోలుకున్న మినుము

కొనకనమిట్ల: అల్పపీడనం ప్రభావంతో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలు మెట్ట పంటలకు జీవం పోశాయి. ఇటీవల పదును వర్షం కురవడంతో ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, పత్తి, ఆముదం పంటలతో పాటు ఖరీఫ్‌లో సాగు చేసిన మినుము, అలసంద (బొబ్బర్లు), వరి, మిర్చి, పొగాకు పంటలతో పాటు కూరగాయలు, పండ్ల తోటలకు వర్షం జవం పోసింది. పంటలు సాగు చేసిన తర్వాత అనుకూలంగా వర్షాలు లేకపోవటంతో ఇటీవల వరకు పంటలు ఎండుముఖం పట్టాయి. ఎట్టకేలకు పదును వర్షం పడటంతో పంటలు పచ్చదనం నెలకొన్నాయి. పలు గ్రామాల్లో సాగు చేయని పొలాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వర్షాలకు చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలకు కొద్ది మేర నీరు చేరటం పశువులకు కొంత ఇబ్బందులు తీరాయి. ఇంకా పలు గ్రామాల్లో వరి, మిర్చి నాట్లు పూర్తవగా లేత సాగులో పొగాకు నాట్లు వేస్తున్నారు. రానున్న రోజుల్లో కూడా మంచి వర్షాలు పడితే పంటలు ఓ రకంగా పండుతాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా అందరం కలిసి కట్టుగా పని చేద్దామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర విజయవంతంగా జరగటంతో యాత్రకు మండలంలోని అన్నీ గ్రామాల నుంచి పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షణలో తరలి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక సాధికార యాత్ర సక్సెస్ కావడంతో బుధవారం మండలం నుంచి పార్టీ నాయకులు తరలి వెళ్లి ఎమ్మెల్యే కేపీ, పెద్దాయన కేపీ కొండారెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే కేపీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ కోసం అహర్నిశలూ పని చేసి మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను చేసుకుందామన్నారు. ఎమ్మెల్యే కేపీని కలిసిన వారిలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెద వెంకటరెడ్డి, యూత్ నాయకులు తాతిరెడ్డి చలమారెడ్డి, సీసీకేఆర్ శ్రీను, కళశం అంజిరెడ్డి, రాంబాబు, రమణారెడ్డి, వద్దిమడుగు ఎంపీటీసీ చొక్కార వెలుగొండయ్య, జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఏలూరి సంజీవరెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్లు కె.వెంకటేశ్వర్లు, ఆలు గోపిరెడ్డి, ఉడుముల వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రజలకు వివరించాలి

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు సీఎం కావాలంటే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో బుధవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత దివంగత నేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జగనన్న ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రజలు అనేక సంక్షేమ పథకాల ద్వారా అన్ని రకాలుగా లబ్ధి పొందుతున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలను మెప్పించే జనరంజక పరిపాలన జగనన్నకే సాధ్యమన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైద్యశాల భవనాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు వంటి భవనాలు నూతనంగా నిర్మించారన్నారు. కళ్ల ముందు అభివృద్ధి కనబడుతున్నా ప్రతిపక్షాలు కేవలం బురదజల్లే చర్యలు చేస్తున్నాయని మండిపడ్డారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థికి అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నూతనంగా 66 వేల మంది వైద్యులను నియమించారని చెప్పారు. గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి తేడా గుర్తించిన ప్రజలే ఎన్నికల్లో సరైన సమాధానం చెబుతారన్నారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇంటి స్థలాలు ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. అందులో 10 లక్షల మంది లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఈ సందర్భంగా సాయంత్రం ఎమ్మెల్యే అన్నా తన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేటి నుంచి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు సీఎం అనే కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లాల్సి ఉంటుందన్నారు. అందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు సంకల్ప సిద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అభివృద్ధి పథకాలపై పూర్తి అవగాహన కల్పించాల్సి బాధ్యత మన అందరిపై ఉందని ఎమ్మెల్యే అన్నా రాంబాబు వివరించారు. నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్‌లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపికా, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ భూమా నరసింహారెడ్డి, బోయిళ్ల జనార్దన్‌రెడ్డి, ఓబులరావు, ఈశ్వర్‌నాయుడు, గోన రంజిత్, వెంకటరామిరెడ్డి, శ్రీరాములు, డాక్టర్ రఫీ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

● మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వం లక్ష్యమని మర్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం పొదిలి ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో రూ.17.50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న ఓపెన్ ఆడిటోరియం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్య వ్యవస్థలో అనేక సంస్కరణలు చేసి విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, మధ్యాహ్న భోజనంతో పాటు పాఠశాల తెరిచే మొదటి రోజునే బట్టలు, బుక్స్ అందజేస్తోందన్నారు. విద్యార్థులు మంచి అలవాట్లు అలవర్చుకుని చదువుకున్న పాఠశాలకు, పుట్టిన ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేపీ రమణారెడ్డి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షుడు డి.శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే నూర్జహాన్‌బేగం, జేసీఎస్ కన్వీనర్ గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, బండి అశోక్, గూడూరి వినోద్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు పులిగొర్ల శ్రీనివాసరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు కొత్తపులి బ్రహ్మారెడ్డి, పీఆర్ ఏఈ మస్తాన్‌రావు, బీవీ రెడ్డి పాల్గొన్నారు.

బీసీ భవన్ మంజూరుపై హర్షం



ఎమ్మెల్యే కేపీని సన్మానిస్తున్న బీసీ సంఘాల నాయకులు

మార్కాపురం: పట్టణానికి బీసీ భవన్‌ను మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ తరఫున ధన్యవాదాలు తెలపాలని మార్కాపురం బీసీ సంఘాల నాయకులు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి విజ్ఞప్తి చేశారు. సామాజిక సాధికార యాత్రలో భాగంగా బీసీ భవన్ నిర్మించే ప్రాంతానికి ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రులు మేరుగ నాగార్జున, డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు పార్థసారథి, హఫీజ్‌ఖాన్‌లను తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేయించిన కేపీ నాగార్జునరెడ్డిని బీసి సంఘాల నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. బీసీ (బ్రిలియంట్ కమ్యూనిటీస్ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడు పీఎల్‌పి యాదవ్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి బలహీనవర్గాల వారి కోసం బీసీ భవన్ కావాలని కోరుతున్నా ఎవరూ మంజూరు చేయలేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ద్వారా తమ కల సాకారమైందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కేపీని ఘనంగా సన్మానించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎం.షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, నియోజకవర్గ బీసీ సంఘ అధ్యక్షుడు ఐ.రంగస్వామిగౌడ్, న్యాయవాది నాగార్జున, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు ఇన్‌చార్జిలు, కార్యకర్తలు కూడా ఎమ్మెల్యేను సన్మానించారు.

విశాఖ ఉక్కు కోసం విద్యా సంస్థల బంద్



దర్శిలో మాట్లాడుతున్న పిచ్చయ్య



మార్కాపురంలో మాట్లాడుతున్న విద్యార్థులు

మార్కాపురం టౌన్: విశాఖ ఉక్కును పరిరక్షించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా బుధవారం మార్కాపురం పట్టణంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మందా రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విజయ్‌లు మాట్లాడుతూ విశాఖ ఉక్కుకోసం 32 మంది ప్రాణాలు పణంగా పెట్టారని, అటువంటి ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేసే చర్యలను కేంద్రం మానుకోవాలన్నారు. విశాఖ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన స్టీల్‌ప్లాంట్‌ను బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు కుట్రలు చేస్తోందన్నారు. నవంబర్ 8వ తేదీ నాటికి ఫ్యాక్టరీ కోసం చేస్తున్న ఆందోళన 1000 రోజులు పూర్తవుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి వెంకటరావు, పీడీఎస్‌యు కన్వీనర్ రాజేష్ పాల్గొన్నారు.

దర్శి: ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య అన్నారు. విశాఖ ఉక్కు, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యా సంస్థలు బంద్ పాటించారు. రామాంజి, కైపు వెంకటకృష్ణారెడ్డి, వెంకట్రావు పాల్గొన్నారు.

కంభం: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో చేపట్టిన బంద్ సందర్భంగా పట్టణంలో ప్రైవేటు విద్యాసంస్థలన్నీ బుధవారం స్వచ్ఛందంగా మూసివేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి వెంకట్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రవి, రామయ్య, రాజశేఖర్, రంగనాయకులు, విష్ణు పాల్గొన్నారు.

మాదిగ విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

పొదిలి: హలో మాదిగ.. చలో హైదరాబాద్ కార్యక్రమం ఈ నెల 11వ తేదీన జరుగుతుందని మండల కన్వీనర్ వేల్పుల సురేష్ మాదిగ చెప్పారు. బుధవారం రాత్రి స్థానిక బాప్టిస్ట్ పాలెంలో కార్యక్రమ సన్నాహాల్లో భాగంగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ హైదరాబాద్ తరలి వెళ్లేందుకు ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్‌పీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎక్కడ బయల్దేరాలి, ఎక్కడకు చేరాలి, వాహనాలు, సౌకర్యాలు తదితర వివరాల గురించి చర్చించారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు ఎంపీపీ షేక్ ఖాశింబీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.కవితాచౌదరి బుధవారం తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండల అధికారులు పూర్తి సమాచారంతో తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు.

సమస్యలను అధికారులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు (ముండ్లమూరు): సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మండల స్థాయి అధికారులదేనని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగనన్నకు ధన్యవాదాలు తెలిపారు. జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అడిగే సమస్యలకు సరైన సమాధానాలు చెప్పకుండా అధికారులు దాటవేయడం సరైన పద్ధతి కాదన్నారు. విద్యుత్ సమస్యలు ఉన్నాయని అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యలు ఎందుకు పరిష్కరించడంలేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నిలదీశారు. సర్వేయర్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 609 మంది హౌసింగ్ లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ తెలిపారు. ఎంపీపీ కె. యుగకీర్తి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను సమన్వం చేసుకొని పరిష్కరించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం 18 కోట్ల 71 లక్షలతో వచ్చే ఏడాదికి అంచనాల బడ్జెట్‌ను ఆమోదించారు. వైస్ ఎంపీపీలు వై. వెంకటేశ్వరరెడ్డి, మంచాల ప్రయాంక నాగార్జున రెడ్డి, తహసీల్దార్ కేవీ ప్రసాద్, ఏఓ బి. ప్రసాదరావు, సీడీపీఓ భారతి, ఏపీఎం దేవరాజ్ పాల్గొన్నారు.


శాంతి రథం కోసం రూ.4 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

పొదిలి: మానవత స్వచ్ఛంద సంస్థ కోసం శాంతి రథం కొనుగోలు చేయాలని తీర్మానించారు. ఈ మేరకు రూ.8 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ మొత్తంలో 50 శాతం సంస్థ డైరెక్టర్‌లలో ఒకరైన శ్రావణి వెంకటేశ్వర్లు రూ.4 లక్షల విరాళాన్ని సంస్థ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. సంస్థ మరో డైరెక్టర్ శామంతపూడి నాగేశ్వరరావు ఫ్రీజర్ బాక్సు కోసం విరాళం అందజేశారు. వీరిని సంస్థ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ మువ్వల పార్థసారథి, కన్వీరన్ కె.యల్లమందారెడ్డి, అధ్యక్షుడు కల్లం వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు బండి అశోక్, కార్యదర్శి టి.వెంకటరావు, కోశాధికారి సోమిశెట్టి చిరంజీవి, కాటూరి పెద్దబాబు, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గుర్రపుసాల శ్రీనివాసులు, యక్కలి శేషగిరిరావు, గూడూరి వినోద్, షేక్ బాజీ, నాట్యాచార్యులు శివశంకర్, వరికుంట్ల వినోద్‌రాజ్, కాటూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్షేమం అందాలంటే జగనన్న రావాలి



మాట్లాడుతున్న కోటిరెడ్డి

దర్శి: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని సచివాలయాల జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఎదురుకోటిరెడ్డి స్పష్టం చేశారు. నగర పంచాయతీ పరిధిలోని 5వ సచివాలయం శివరాజనగర్ పరిధిలో మా నమ్మకం నువ్వే జగనన్న మళ్ళీ ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు ముఖ్యమంత్రిగా రావాలి కార్యక్రమం బుధవారం జరిగింది. కోటిరెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాలు పేద జీవితాల్లో వెలుగులు నింపాయని చెప్పారు. మాజీ ఎంపీటీసీ కరిపిరెడ్డి సుబ్బారెడ్డి , ముప్పూరి బ్రహ్మయ్య, ఎం. రామకృష్ణ పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగనన్న' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ హనుమంతరావు

ముండ్లమూరు: మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ హనుమంతరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రజలకు చేకూర్చిన లబ్ధిని వివరించాలన్నారు. ఈఓఆర్డీ శ్రీదేవి, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

బేస్తవారిపేట: ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేసిన సంక్షేమ పథకాలపై ఈ నెల 9వ తేదీ నుంచి 23 వరకు సచివాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పార్వతి తెలిపారు. డీబీటీ, నాన్ డీబీటీ పథకాలపై ప్రదర్శన బోర్డులతో రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 వరకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 9వ తేదీన బేస్తవారిపేట–1, 10న బేస్తవారిపేట–2, 14న చెట్టిచర్ల, 15న నేకునాంబాద్, 16న సలకలవీడు, 17న జేబీకే పురం, 20న పిటికాయగుళ్ల, 21న పూసలపాడు, 22న ఎంపీ చెరువు, 23న జేసీ అగ్రహారం గ్రామ సచివాలయాల్లో నోడల్ అధికారి, విస్తరణాధికారి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

● డీఎస్పీ వీరరాఘవరెడ్డి



షాపులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డి

మార్కాపురం: మార్కాపురంలో నిబంధనలు పాటించకుండా దీపావళి టపాసులు అమ్మే దుకాణాలపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణంలోని పలు దీపావళి మందులు అమ్మే దుకాణాలను సీఐ భీమానాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపు షాపునకు మధ్య 5 అడుగుల దూరం ఉండాలని, ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, నీళ్లు, ఇసుక తదితర వాటిని ప్రతి షాపు ముందు ఏర్పాటు చేసుకోవాలని, అగ్ని మాపక అధికారుల ఫోన్ నంబర్లు దగ్గర పెట్టుకోవాలని సూచించారు. అనధికారికంగా మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జనవాసాల మధ్య దీపావళి మందులను నిల్వ ఉంచవద్దన్నారు. వీరి వెంట పట్టణ ఎస్ఐ కోటేశ్వరరావు ఉన్నారు.